بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّى عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

# Summary of Friday Sermon Huzur-e-Anwar 09.10.2015 (Telugu)

**తమను తాము అహ్మదియ్య జమాఅత్‌తో జోడించు ప్రతి అహ్మది జమాఅత్ వ్యవస్థతో దృఢమైన సంబంధము కలిగి, అహ్మదియ్య ఖిలాపత్‌తో విశ్వసనీయత, విధేయత బంధమును కొనసాగించుట అనివార్యము. ఎందుకనగా బైఅత్ చేసినప్పుడు ఈ ప్రతిజ్ఞయే చేసెను. ఖిలాఫత్ ద్వారా ఇవ్వబడిన ఉపదేశములు, ఆదేశములు, కార్యక్రమములను అవలంభించే ఈ ప్రతిజ్ఞను పూర్తి చేయవచ్చును.**

*హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 09.10.2015 తేదీన మస్జిద్ బైతుల్ బైతుల్ ఫుతూహ్ - లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. ఇక్కడున్న అహ్మదీయులలో అధికులు జన్మతః అహ్మదీయులే. లేదా వారి బాల్యములోనే అహ్మదియ్యత్ వచ్చెను. కనుక వారు అహ్మదీయ వాతావరణంలో పెరిగిరి. వీరిలో కూడ అధికులు పాకిస్తానీయులే. పాకిస్తాన్‌లో స్వతంత్రముగా తమ మతము ప్రకారము ఇస్లామీయ బోధనలను పాటించే అనుమతి లేదని మీరు వ్యక్తపరచినందునే ఈ దేశములో నివసించే లేదా ఇక్కడి పౌరసత్వము లభించినది. ప్రత్యక్ష్యముగా వ్యాజ్యములను ఎదుర్కొన్న వారు కూడ కొందరుండవచ్చును. ఈ అధికులకు తమను తాము అహ్మదీ అన్నందుకే ఇక్కడ నివసించే అనుమతి లేదా ప్రభుత్వ సానుభూతి లభించినది. ఈ అహ్మదీ అను ప్రకటన మీపై కొన్ని బాధ్యతలను మోపును. విద్య లేదా ఇతర నైపుణ్య ప్రతిభ వలన ఈ దేశమునకు వచ్చిన అహ్మదీయులు కూడ ఈ బాధ్యత నుండి తప్పించుకోలేరు. వారిక్కడికి వచ్చిన తరువాత తమ విద్యా సామర్థ్యములను, నైపుణ్యమును మరింత మెరుగుపరచుకొను అవకాశములు లభించినవి. వారు కూడ తమను తాము అహ్మదియ్య జమాఅత్‌తో జోడింతురు. ఇటులనే క్రొత్తగా బైఅత్ చేసిన వారు కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రకటన సత్యమైనదని నమ్మినందున బైఅత్ చేసినారు. కనుక బైఅత్ తరువాత ఈ బైఅత్ హక్కును చెల్లించు బాధ్యత వారిపై గలదు. జన్మతః అహ్మదీయులను లేదా పాత అహ్మదీయులను ఇలా చేయుచు చూచినామని వారనడంతో అల్లాహ్ తఆలా వారినీ బాధ్యత గురించి ప్రశ్నించకుండా వీడడు.

ఈ కాలములో మన సవరణ, పవిత్ర ఖుర్ఆన్, ప్రవక్త పద్ధతి గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం విశ్లేషణలు, వివరణలు, రచనలను అర్థము చేసుకొనుట తప్పనిసరి. వాటిని చూచుట, చదువుట కూడ అనివార్యము. ఇవన్ని మనముందున్నవి. కనుక ఎవరికి కూడ ఎటువంటి సాకు లేదు. మీ ఉదాహరణను చూచి ఎవరైనా మోసపోయినచో మీరీ తప్పిదము, పాపములో తప్పక భాగస్వాములగుచున్నారని నేను పాత అహ్మదీయులకు చెప్పదలచితిని. పాత అహ్మదీయుల తాత ముత్తాతలు అహ్మదీయులైనందున లేదా వారి బాల్యములో అహ్మదియ్యత్ లభించినందున అల్లాహ్ తఆలా వారిని కరుణించెను. అల్లాహ్ తఆలా అనుగ్రహము, ఉపకాముతో ఇక్కడికి వచ్చిన తరువాత మెరుగైన స్థితి ఏర్పడినది. జమాఅత్ ఉపకారము వారిపై యున్నదని వారు మరచిపోకూడదు. ఈ ఉపకారమునకు కృతజ్ఞతగా వారు తమ స్థితులలో అసాధారణ పవిత్ర మార్పును కలిగించుకొనుటకు కృషి చేయవలెను. అల్లాహ్ తఆలా జమాఅత్‌లో చేరినందున ఈ ఉపకారము గురించి తమ సంతానమునకు కూడ చెప్పుచుండవలెను.

తమను తాము అహ్మదీ అన్నందుకు జమాఅత్ వ్యవస్థతో దృఢమైన బంధము కలిగియుండుట, అహ్మదియ్య ఖిలాఫత్‌తో విశ్వసనీయత, విధేయత బంధమును కొనసాగించుట ప్రతి అహ్మదీయుని కర్తవ్యము. ఎందుకనగా బైఅత్ చేసినప్పుడే ఈ ప్రతిజ్ఞ చేసెను. పూర్తి అవగాహనతో, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రకటనను అర్థము చేసుకొని స్వీకరించి క్రొత్తగా చేరువారు అల్లాహ్ తఆలా కృపానుసారము తమ బైఅత్ ప్రతిజ్ఞ, దాని నిబంధనలను కూడ పరిశీలించుచుందురు. చాలా మంది నాకు కూడ ఉత్తరములు వ్రాయుదురు. కాని జన్మతః అహ్మదీయులైన లేదా వారి తల్లిదండ్రులు బాల్యములోనే అహ్మదియ్యత్‌ను స్వీకరించినవారు ప్రాపంచిక వ్యవహారములలో అధికంగా నిమగ్నమైరి. వారు సాధారణముగా బైఅత్ నిబంధనలను పరిశీలించరు, బైఅత్‌ను గమనించరు. అహ్మదియ్యత్ వలన అల్లాహ్ ఉపకారమును కూడ గుర్తుంచుకోరు. వాస్తవానికి ఇప్పుడు అన్ని చోట్ల ఎమ్.టి.ఏ. ద్వారా బైఅత్ కార్యక్రమము తిలకించబడును, వినబడును. ఇటువైపు శ్రద్ధ వహించి బైఅత్‌ను, బైఅత్ వాస్తవమును తెలుసుకొనుటకు, దానిని ఆచరించుటకు కృషి చేయరు. ఖిలాఫత్‌తో కూడ సరియైన రీతిలో బంధమును జోడించుటకు ప్రయత్నించరు.

ప్రతి ఒక్కరు ఆత్మ పరిశీలన చేసికొనినచో ఎవరెక్కడ నిలిచియున్నారో తెలిసిపోవును. ఇప్పుడు నేను ఈ పరిశీలన కొరకు ఒక్క బైఅత్ నిబంధనను ప్రస్తావింతును. దీనిని ఆషామాషీగా చూడకుము. గమనించుము, అనంతరం ఆత్మపరిశీలన చేసుకొనుము, దీని సమాధానము అవునైనచో అదృష్టవంతులే. ఇటువంటి వ్యక్తులు అల్లాహ్ తఆలా అనుగ్రహములను పొందువారే. లోపమున్నచో సవరించుకొనుటకు ప్రయత్నించుము. బైఅత్ పదవ నిబంధనలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. "కేవలము అల్లాహ్ ప్రీతి కొరకు నాతో సోదర భావము కలిగి మరణించు వరకు వినయ విధేయతను ప్రదర్శించును. ఈ బాంధవ్యము ఇతర బంధాలలో కానరాని విధముగా ఉన్నత స్థాయి నందుకొని వుండును."

వారు అలైహిస్సలాంతో నిస్వార్థమైన అనంత, సాటిలేని ప్రేమ, బంధము కలిగియుండవలెనని ఈ పదములు మనపై బాధ్యతను మోపుచున్నవి. వారు మనతో ప్రతిజ్ఞ తీసుకుంటున్నారు. ఏ ప్రతిజ్ఞ తీసుకుంటున్నారు ? అనగా అల్లాహ్ తఆలా కొరకు నాతో ప్రేమపూర్వక బంధము, సోదరభావ గొప్ప ప్రమాణమును ఏర్పాటుచేసుకొనుము. వారి ప్రతి సముచిత తీర్మాణమును నమ్ముతానని వారు ప్రతిజ్ఞ తీసుకొంటున్నారు. అనగా అల్లాహ్ తఆలా వారిని పంపిన ప్రతి విషయము. ఇస్లాం బోధనానుసారము వారు మమ్ములను ఉపదేశించిన ప్రతి విషయము. అనంతరం దానిని కేవలం నమ్మటమే కాదు, విధేయత వహించుటయే కాదు. తుది శ్వాస వరకు దీనిపై నిలిచెదను, ఆచరింతును. ఏర్పడిన ప్రేమ, సంబంధమును ప్రపంచ బంధుత్వము, బంధములలో లభించని ఉదాహరణ కంటే ఉత్తమ ప్రమాణము వరకు చేర్చెదను. మానవుడు విశ్వసనీయత వలన ఒకరితో బంధమును ఏర్పరచుకొనుటలో కూడ దీని ఉదాహరణ లభించకూడదు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత గొప్ప ప్రేమ వారి నిజమైన దాసునితోనే ఏర్పడవచ్చును. ఈ ప్రమాణములను పొందుటకు మనము కృషి చేయవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్‌లోకి వచ్చిన తరువాత వారితో ఏ విధమైన సంబంధము యుండవలెను. ప్రతి ఒక్కరు ఈ విషయముల ఆధారముగా తమను తాము పరిశీలించుకోవచ్చును. మన ప్రమాణములు ఇవేనా, ప్రాపంచిక సమస్యలు మనముందున్నప్పుడు, ప్రాపంచిక లాభములు మనముందున్నప్పుడు, ప్రాపంచిక ప్రయోజనములు మనముందున్నప్పుడు ఈ విషయములను మరచిపోవుదుము. ప్రాపంచిక సంబంధములు, ప్రాపంచిక ఉద్దేశములు ఈ ప్రేమ, విధేయతను వెనెక్కి నెట్టును. సరియైన ధార్మిక అవగాహన, ఆలోచన యున్నచో ధార్మిక కార్యమును మానవుడు ప్రేమ, విధేయత భావముతో చేయును. వారి బైఅత్‌లో చేరి ఈ స్ఫూర్తిని పెంచవలెనని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనతో ఆశించిరి. ఈ స్ఫూరి, విధేయత, వినమ్రత, విశ్వసనీయత, బంధము ఏర్పడనంత వరకు చేయబడుచున్న ఉపదేశములు ప్రభావితము కాలేవు. ఉపదేశములను పాటించదలచినచో, వారి మాటలను వినదలచినచో, తమ బైఅత్ ప్రతిజ్ఞను పూర్తి చేయదలచినచో విధేయత, వినమ్రత, విశ్వసనీయత ప్రమాణములను కూడ పెంపొందించుము. విధేయత, విశ్వసనీయతను ఉత్తమ స్థాయికి చేర్చి సంపూర్ణ రీతిలో విధేయత వహించుటయే

సముచిత విధేయత అని ప్రతి అహ్మదీ భావించవలెను. ఎవరి విధేయత వహించుచున్నారో వారి ప్రతి ఆదేశమును అన్వేషించు ఉత్సాహము యున్నప్పుడే సంపూర్ణ విధేయత వహించవచ్చును. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చూపిన నియమములను, ఆదేశములను అన్వేషించి, వాటిని ఆచరించుటకు ప్రయత్నించుట మన కర్తవ్యము. లేనిచో మేము ప్రతి విషయమును నమ్ముచున్నామను ప్రకటన మాత్రమే యుండును. ఆ విషయములో మనకు తెలియనప్పుడు మనమేమి నమ్మెదము. దేనిని నమ్మవలెను. అహ్మదీ అయినందుకు తమ విద్యను పెంచుకొను నిబంధన కూడ యున్నది. అల్లాహ్ తఆలా కొరకు ఏ బంధమును ఏర్పరచుకున్నామో అల్లాహ్ తఆలా ప్రీతిని పొందుటకు దానిని పెంపొందించవలెను. తమ జీవితమును పూర్తిగా అతని ప్రకారము చేసుకోవలెను.

హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపిన ఉపదేశములు, జమాఅత్ సభ్యులతో ఆశించిన ఆశయములు వారి వివిధ పుస్తకములు, వాఖ్యములలో గలవు. ఇప్పుడు వాటిలో నుండి కొన్నిటిని మీ ముందు ప్రస్తావింతును. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. మన జమాఅత్ కేవలము మాటలకే పరిమితం కాకూడదు. (కేవలము బాహ్య రూపంలోనే మాటలుండకూడదు.) బైఅత్ నిజమైన ఉద్ధేశమును పూర్తి చేయునట్లు యుండవలెను. (నిజమైన ఉద్దేశమేమిటి ?) అంతర్గత మార్పు కలుగవలెను. మాటలతోనే అల్లాహ్‌ను సంతోషపెట్టలేరు. అంతర్గత మార్పు లేనిచో మీలో ఇతరులలో ఎలాంటి తేడా లేదు. కనుక ప్రతి ఒక్కరు తన భారమును మోయుచు, తన వాగ్దానమును పూర్తి చేయవలెను. ఆచరణ లేనిచో, ఆచరణ స్థితులు మెరుగుపడనిచో కేవలము విశ్వాసపరంగా తమను తాము సరిదిద్దుకొని, బైఅత్ చేసి, హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను విశ్వసించుట, సమస్యలలో, సంభాషణలో ఇతరులను నోరు మూయించుట నిరర్థకము. తమ మనసు మార్చునకు ప్రయత్నించుము, నమాజ్‌లో ప్రార్థన చేయుము. దాన, ధర్మములతో, ఇతర దాడుల నుండి సురక్షితముగా وَالَّذِيْنَ جَاهَدُوْا فِيْنَا లో చేరుము. وَالَّذِيْنَ جَاهَدُوْا فِيْنَا ఏమిటి ? మా మార్గములలో ప్రయత్నించిన వారికి لَنَهْدِيَنَّهُمْ سُبُلَنَا మేము తప్పక మా మార్గములను చూపెదము.

దీనిని మరో చోట ఇంకా వివరించిరి. పూర్తి శక్తి, వివేకము, విధేయతతో అల్లాహ్ తఆలాను అన్వేషించు వ్యక్తికి సమానముగా అతి నిర్లక్ష్యముతో అలసత్వము వహించుచున్న మరో వ్యక్తి ఎలా అల్లాహ్ తఆలా అనుగ్రహముతో లబ్ది పొందవచ్చును.

మీరు నన్ను నమ్మి, నన్ను అనుసరించుము, నా విధేయత వహించుమని వారు చెప్పినప్పుడు అల్లాహ్ తఆలాను అన్వేషించు మార్గములు మనకు చూపిరి. ఎలా అల్లాహ్ తఆలాను పొందవచ్చునో, అల్లాహ్ తఆలా అనుగ్రహములో ఎలా భాగస్వాములు కావచ్చునో, మన నమాజులను నిర్ణీత సమయములో, శ్రద్ధతో ఎలా సలుపవలెనో మనకు తెలిపిరి. అల్లాహ్ తఆలా ప్రేమను ఆకర్షించుటకు దాన, ధర్మముల వైపు కూడ శ్రద్ధ వహించుము. వారితో బంధము, విధేయత సంబంధము మనలను అల్లాహ్ తఆలాతో సంబంధములో పెంచుటట్లు కావలెను.

హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తరువాత అల్లాహ్ తఆలా మనలో ఖిలాఫత్‌ను ఏర్పరచెను. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు అల్లాహ్ తఆలా అప్పగించిన ఇదే కార్యమును ఖిలాఫత్ వ్యవస్థ కూడ ముందుకు కొనసాగించెను. కనుక ఖిలాఫత్‌తో విశ్వసనీయత, విధేయత సంబంధమును ఏర్పరచుకొని ప్రయాణమును మన లక్ష్యము వైపు కొనసాగించవచ్చును. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. నిజమైన ముస్లింగా మారి ఇస్లాం సందేశమును ప్రపంచములో వ్యాపింపజేయవలెను. వర్తమాన ఖలీఫా హస్తమున కూడ ప్రతి అహ్మదీ బైఅత్ ప్రతిజ్ఞ చేయును. కనుక ఈ ప్రతిజ్ఞను కూడ పూర్తి చేయుట అనివార్యము. ఖిలాఫత్ తరపున వెలువడిన ఆదేశములు, ఉపదేశములు, కార్యక్రమములను ఆచరించే ఈ ప్రతిజ్ఞను పూర్తి చేయవచ్చును.

బైఅత్ చేయునప్పుడు బైఅత్ నిబంధనలలో యున్న ఈ నిబంధనలను పాటించునని ప్రతి అహ్మదీ ప్రతిజ్ఞ చేయును. వర్తమాన ఖలీఫా ఆదేశించు ప్రతి సముచిత ఆదేశమును పాటించును. ఇస్లాం సందేశమును ప్రపంచ నలుమూలలకు అందించును. ప్రతి అహ్మదీ ఈ భావనతో తనను తాను సిద్ధము చేసుకున్ననప్పుడే నిజమైన

విధేయత ప్రమాణములు ఏర్పడును. అప్పుడే జమాఅత్ ఒక సంస్థగా మారును. అప్పుడే ప్రచార మైదానములు విశాలమగును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో సోదరభావ, విశ్వాస సంబంధమున్నదని ప్రతి ఒక్కరు ప్రకటించి తమ తమ దారులు నిర్ణయించుకొన్నచో ఎన్నడు అభివృద్ధి కాదు. ఖిలాఫత్ వ్యవస్థ వల్లనే అహ్మదియ్య జమాఅత్ వ్యవస్థలో అందము గలదు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన బానిస అయినందుకే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో ప్రతి ఒక్క అహ్మదీ సంబంధము కలిగియున్నాడు. ఈ సంబంధమును ఖిలాఫత్‌తో కూడ కొనసాగించుట తప్పనిసరి. ఈ కాలములో ఆవిష్కరించబడిన ఆధునిక సౌకర్యములు, పరిశోధనలను అల్లాహ్ తఆలా అహ్మదీయులకు కూడ ప్రసాదించినందున అహ్మదీయులు అదృష్టవంతులు. ధర్మ ప్రచారము కొరకు జమాఅత్‌నకు ఈ సౌకర్యములు అనుగ్రహించెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం రచనలు నేడు టి.వి., ఇంటర్నెట్, వెబ్ సైట్ మొ॥ లో యున్నవి. మనము ఇష్టమున్నప్పుడు చూడవచ్చును. వివిధ భాషలలో వాటిని చూడవచ్చును, వినవచ్చును. ఇంకా వర్తమాన ఖలీఫ ఖుత్బాలు, ప్రసంగములను చూడవచ్చును, వినవచ్చును. అవి పవిత్ర ఖుర్ఆన్, హదీసు బోధనతో కూడి యుండును. వాటి ఆధారముగానే నేడు ప్రపంచములో ఎమ్.టి.ఏ. ద్వారా బోధనలు ప్రతి చోట అందించబడుచున్నవి. ఇది జమాఅత్‌ను ఐక్యముగా యుంచుటకు ఒక నూతన అధ్యాయముగా నిలిచినది. కనుక మీలోని ప్రతి ఒక్కరు ఈ విషయమును గుర్తుంచుకోవలెను. ఈ సంస్థలో భాగమగుటకు ఎమ్.టి.ఏ.తో బంధమును ప్రతి ఒక్కరు ఏర్పరచుకోవలెను. కనీసం ప్రతి వారము ఖుత్బా వినుటకు శ్రద్ధ వహించుము. కుటుంబములోని ప్రతి వ్యక్తి ఖుత్బా విన్నాడా లేదా అని ప్రతి కుటుంబము పరిశీలించుకోవలెను. భార్య విని, భర్త విననిచో కూడ లాభము లేదు. తల్లి విని, పిల్లలు వినినిచో కూడ ప్రయోజనము లేదు. ఒక్క సంస్థగా ఏర్పడుటకు అల్లాహ్ తఆలా ఈ ఏర్పాటు చేసెను. ఏక కాలములో ప్రపంచములోని ప్రతి మూలకు వర్తమాన ఖలీఫా ప్రవచనము చేరుచున్నది. దీని భాగమగుట అనివార్యము. ఇటువైపు శ్రద్ధ వహించుము. ఏమి అంటున్నారో తెలియనిచో విధేయత ఎలా వహింతురు. మాటలు విన్నప్పుడే విధేయత వహించగలరు. ఏ మాటలను అనుసరించాలో వాటిని వెతుకుము. ప్రతి గృహము ఇటువైపు శ్రద్ధ వహించుటట్లు అల్లాహ్ తఆలా చేయుగాక! మన సంస్కరణ కొరక అల్లాహ్ తఆలా అందించిన సౌకర్యములతో అబ్ది పొందువారమగుగాక! సంస్కరణయే కాక ఇస్లాం బోధన ప్రచారములో కూడ ఇదొక పెద్ద పాత్ర పోషించుచున్నది. ఏదేని కారణముతో ప్రత్యక్షముగా వినలేనిచో ఇంటర్నెట్‌పై యున్న రికార్డింగ్ వినవచ్చును. ఖుత్బాలతో పాటు ఇతర ముఖ్యమైన కార్యక్రమములు కూడ ప్రసారమగును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో సంబంధమును ఏర్పరచుటతో పాటు వారి తరువాత ఖిలాఫత్ వ్యవస్థతో కూడ గట్టి బంధమును కొనసాగించువారగుదురు గాక! విధేయత ఉదాహరణలను నెలకొల్పువారగుదరు గాక! ఈ బంధము, విధేయతే ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హదీసు ప్రకారము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం విధేయత నుండి ముందుకు వెళ్లి అల్లాహ్ తఆలా విధేయతగా మారి అల్లాహ్ తఆలా ప్రీతికి కారణమగును. అల్లాహ్ తఆలా ఇందుకు అనుగ్రహించుగాక!

❀❀❀

BOOK POST (PRINTED MATTER)

To,
..........................................................................
..........................................................................
..........................................................................